క్లుప్తంగా

ప్రజలకు అత్యాధునిక వైద్యసేవలు

• మంత్రి బొత్స సత్యనారాయణ



ఎంఆర్ఐ స్కాన్ రూమ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

విజయనగరం ఫోర్ట్: అత్యాధునిక వైద్య సేవలను ప్రజలకు చేరువ చేయాలని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. స్థానిక తిరుమల మెడికవర్ ఆస్పత్రిలో అత్యాధునిక ఇంటలిజెంట్ ఎంఆర్ఐ స్కానింగ్ మెషీన్‌ను మంగళవారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సేవా దృక్పథంతో ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నారు. డాక్టర్ తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ, మనిషి శరీరంలో ఎక్కడ సమస్య ఉందో కొన్ని నిమిషాల్లోనే టెక్నాలజీ ద్వారా తెలుసుకుంటున్నట్లు చెప్పారు. ఇందులో ఎంఆర్ఐ స్కాన్ ఒకటి అని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు ముద్రు జయచంద్రనాయుడు, జిల్లా అధ్యక్షుడు వి. అశోక్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల విజయోత్సవాలు

నెల్లిమర్ల: సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో మున్సిపల్ కార్మికులు బుధవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద విజయోత్సవాలు జరుపుకున్నారు. పారిశుధ్య కార్మికులకు రూ. 21 వేలు, డ్రైవర్లకు రూ.24,500 బేసిక్ వేతనం అమలు చేస్తూ ప్రభుత్వం జీఓ ఇచ్చింది. కార్మికులకు మేలు చేసేలా ప్రభుత్వం 9 జీఓలు ఇచ్చిందని, మరో ఏడు జీఓలు రావాల్సి ఉందని సీఐటీయూ నాయకులు కె. రామారావు, శ్రీను, హరిబాబు, లక్ష్మి, శంకర్, దుర్గారావు, రాము, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

విజయనగరం అర్బన్: పొదుపు సంఘాల మహిళలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెరగాలని డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి అన్నారు. రైతు సాధికారత సంస్థ (ఆర్‌వైఎస్ఎస్), డీఆర్‌డీఏ సంయుక్తంగా పొదుపు సంఘాలలోని కృషి సఖిలకు బుధవారం స్థానిక టీటీడీసీలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ జె.డి తారకరామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీడీ సావిత్రి మాట్లాడుతూ, మండలానికి ముగ్గురు క్రియాశీల పొదుపు సంఘాల మహిళలను కృషి సఖిలుగా ఎంపిక చేసి వారికి ప్రకృతి వ్యవసాయంపై ఐదు రోజుల శిక్షణ అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌వైఎస్ఎస్ డీపీఎం ఆనంద్, డీఆర్‌డీఏ ఎల్‌హెచ్ డీపీఎం ఎం.జయశ్రీ, ఎఫ్‌పీఓ జి.విజయకుమార్, 27 మండలాలకు చెందిన కృషిసఖీలు పాల్గొన్నారు.

ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలి

విజయనగరం అర్బన్: రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రత్యేకంగా ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని గిరిజన విద్యార్థి సమాఖ్య ఉత్తరాంధ్ర జిల్లా అధ్యక్షుడు భానుచంద్ర డిమాండ్ చేసారు. ఈ మేరకు ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో ఉన్న ఐటీడీఏ పరిధిలో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. గిరిజనులు పండించే ప్రతి పంటనూ జీసీసీ ద్వారా కొనుగోలు చేయాలన్నారు. చైర్మన్ స్పందిస్తూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

జగనన్న నాయకత్వంలోనే బీసీలకు పెద్దపీట

విజయనగరం: దశాబ్దాలుగా కేవలం ఓటు బ్యాంక్‌గా పరిగణించబడుతున్న బీసీలకు రాజకీయంగా పెద్దపీట వేసి ప్రోత్సహించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ రౌతు భాస్కరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారంలో ఉన్నంత కాలం బీసీలను నిర్లక్ష్యంగా చూసిన చంద్రబాబు నేడు ఎన్నికల సమయంలో జనసేన పార్టీ అధ్యక్షుడితో కలిసి బీసీ డిక్లరేషన్ చేయడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో బీసీ సామాజికవర్గాలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన విషయాన్ని ప్రతిపక్షాలు గుర్తించుకోవాలన్నారు. అంతేకాకుండా రాష్ట్ర మంత్రివర్గంలో సగానికి పైగా మంత్రి పదవుల్లో బీసీలే ఉన్నారని తెలిపారు. టీడీపీ, జనసేన పార్టీల బీసీ డిక్లరేషన్ ప్రకటనను బీసీలెవ్వరు నమ్మరని పేర్కొన్నారు.

స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలి

• సీఐ వెంకటేశ్వరరావు

పూసపాటిరేగ: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలని భోగాపురం రూరల్ సీఐ బి. వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని కుమిలి, రెల్లివలస గ్రామాలలో సివిల్, కేంద్ర బలగాలతో బుధవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పూసపాటిరేగ ఎస్సై ఎ. సన్యాసినాయుడు, కేంద్రబలగాల అధికారులు పాల్గొన్నారు.

సవరవిల్లిలో సంక్షేమ కాంతులు..

సవరవిల్లి సచివాలయం పరిధిలో లబ్ధిదారులకు చేకూరిన లబ్ధి..
డీబీటీ ద్వారా లబ్ధిదారులకు జరిగిన మేలు : రూ. 15,03,14,354
నాన్ డీబీటీ ద్వారా జరిగిన మేలు : రూ. 7,42,54,864

• ఏళ్లనాటి సమస్యలు పరిష్కారం
• అర్హులందరికీ సంక్షేమ పథకాలు
• అభివృద్ధి కార్యక్రమాలపై సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



రైతుభరోసా కేంద్రం



విలేజ్ హెల్త్ క్లినిక్



సవరవిల్లి గ్రామ సచివాలయం



వెంపాడపేటలో నిర్మించిన సీసీరోడ్డు



విలేజ్ హెల్త్ క్లినిక్ సమీపంలో వేసిన సీసీ రోడ్డు

భోగాపురం: గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ఏర్పడిన తర్వాత ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పరుగులు పెడుతోంది. అర్హులైన పేదలు నేరుగా సచివాలయాలకు వెళ్లి సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకుని లబ్ధి పొందుతున్నారు. ఇందులో ఎలాంటి రాజకీయ ప్రమేయం ఉండకపోవడంతో పారదర్శకంగా పథకాలు అందుతున్నాయి. ప్రతి సచివాలయ పరిధిలో అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి పథకాల వివరాలను డిస్‌ప్లే బోర్డు ద్వారా తెలియజేస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి సచివాలయ పరిధిలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పర్యటించి సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించారు. అంతేకాక ప్రభుత్వం ప్రతి సచివాలయానికి రూ. 20 లక్షలు మంజూరు చేసి గుర్తించిన సమస్యలను పరిష్కరిస్తోంది. దీంతో చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయి. మండలంలోని సవరవిల్లి పంచాయతీ కూడా అభివృద్ధి దిశగా పరుగులెడుతోంది. గ్రామంలో సీసీ రోడ్లు, సైడ్ కాలువలకు కోట్లాది రూపాయలు వెచ్చించారు. ఎన్నో ఏళ్లుగా తీరని సమస్యలకు సైతం పరిష్కారం లభించింది.

డీబీటీ ద్వారా సంక్షేమ పథకాలు

సవరవిల్లి సచివాలయ పరిధిలో డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) ద్వారా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందాయి. జగనన్న అమ్మఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, వైఎస్సార్ రైతుభరోసా, ఉచిత పంటల బీమా, సున్నావడ్డీ పంట రుణాలు, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, వైఎస్సార్ మత్స్యకార భరోసా, డాక్టర్ వైఎస్సార్ పెన్షన్ కానుక, చేయూత, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నావడ్డీ (ఎస్‌హెచ్‌జీలు), బీసీ నేస్తం, కల్యాణమస్తు, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా, హౌసింగ్, వైఎస్సార్ బీమా, వాహనమిత్ర, జగనన్న చేదోడు, తెల్లకార్డుదారులకు కోవిడ్ సమయంలో ప్రత్యేక సాయం, జగనన్న తోడు పథకాల ద్వారా 5,044 మంది లబ్ధిదారులకు 15,03,14,354 రూపాయల నగదు నేరుగా బ్యాంకు ఖాతాలకు ప్రభుత్వం జమ చేసింది. నాన్ డీబీటీ ద్వారా ఇంటి నివాశ స్థలాలు, జగనన్న విద్యాకానుక, విద్యార్థులకు ట్యాబ్స్, జగనన్న తోడు, గోరుముద్ద, సంపూర్ణ పోషణ, ఇంటింటికీ రేషన్ సరుకులు, తదితర పథకాల ద్వారా 1,994 మందికి రూ.7,42,54,864 అందజేశారు. డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా మొత్తం 22,45,69,218 రూపాయలను లబ్ధిదారులకు ప్రభుత్వం అందజేసింది.

రూ.1.82 కోట్లతో అభివృద్ధి, మౌళిక వసతులు

ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు చొరవ తీసుకుని సవరవిల్లి గ్రామంలో రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.17.50 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు నిర్మించారు. రూ.28 లక్షలతో వెంపాడపేట, సచివాలయ పరిధిలో సీసీ రోడ్లు.. రూ.19 లక్షలతో ఉప్పాడపేట, సరగడపేట, యాతపేట గ్రామాల్లో సైడ్ కాలువ పనులు పూర్తి చేశారు. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా రూ.56 లక్షలతో సవరవిల్లి, ఉప్పాడపేట, కుంచువానిపేట గ్రామాల్లోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలను ఆధునీకరించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.

స్థలం ఇచ్చారు

నా సొంతింటి కల నెరవేరింది. ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు ఇల్లు నిర్మించునేందుకు ప్రభుత్వం ఉచితంగా ఇసుక, సిమెంట్, ఐరన్ అందజేయడంతో పాటు ఆర్థిక సాయం చేసింది. దీంతో ఇల్లు నిర్మించుకున్నాను. పేదలకు ఇంతకంటే ఏం కావాలి. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరోసారి సీఎం కావాలని కోరుకుంటున్నాను.
– పూసర్ల వెంకటరమణమ్మ, సవరవిల్లి గ్రామం, భోగాపురం మండలం

సీసీ రోడ్లు వేశారు



మా వెంపాటపేట గ్రామంలో ఎన్నడూ లేనివిధంగా సిమెంట్ రోడ్లు, కాలువలు నిర్మించారు. గతంలో రోడ్లు లేక ఇబ్బందులు పడేవారం. ఎమ్మెల్యే బడ్డుకొండ ఇంటింటికీ వచ్చిన సందర్భంగా అడిగిన వెంటనే రోడ్లు మంజూరు చేశారు.
– పట్నా అప్పలనరసమ్మ, వెంపాడపేట గ్రామం

అభివృద్ధి చేసి చూపారు..



సవరవిల్లి సచివాలయం పరిధిలో అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు బాగా అందాయి. ఎమ్మెల్యే బడ్డుకొండ అభివృద్ధి చేసి చూపి పేదలను ఆదుకున్నారు. పంచాయతీ పరిధిలోని మధుర గ్రామాల్లో పేద ప్రజలు అధికంగా ఉన్నారు. వారికి ప్రభుత్వ పథకాల ద్వారా ఎంతో మేలు జరిగింది.
– ఉప్పాడ విజయభాస్కర్‌రెడ్డి, సర్పంచ్ సవరవల్లి పంచాయతీ, భోగాపురం మండలం



ఆధునీకరించిన ఉప్పాడపేట మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల



కుంచువానిపేట మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల చుట్టూ నిర్మించిన ప్రహరీ



ఉప్పాడపేటలో నిర్మించిన డ్రైనేజీ



సరగడపేటలో నిర్మించిన డ్రైనేజీ

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

• ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స



కొండవెలగాడలో పీహెచ్‌సీ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

నెల్లిమర్ల రూరల్: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని సారిపల్లి గ్రామంలో జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన ఇంటింటి కుళాయిలు, తాగునీటి ట్యాంక్‌తో పాటు రెండు అంగన్‌వాడీ భవనాలు.. కొండవెలగాడలో రూ. 1.10 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం, రూ.5 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబుతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను శతశాతం నెరవేర్చామన్నారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు మాట్లాడుతూ, పేద ప్రజలకు కార్పొరేట్ తరహా వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో సీఎం జగనన్న అన్ని గ్రామాల్లోనూ వైద్యశాలలు ఏర్పాటు చేశారన్నారు.

ప్రభుత్వ దృష్టిలో నిర్వాసితుల సమస్య

సారిపల్లి తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్ట్ నిర్వాసితుల సమస్య ప్రభుత్వ దృష్టిలో ఉందని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ తెలిపారు. గ్రామానికి చెందిన పలువురు జనసేన, టీడీపీ నేతలు నిర్వాసితుల సమస్యను లేవనెత్తారు. దీనికి ఎంపీ, ఎమ్మెల్యే స్పందిస్తూ నిర్వాసితులకు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వంతో తరచూ సంప్రదింపులు జరుపుతున్నామన్నారు.

లబ్ధిదారులకు ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ..

మండలంలోని అర్హులైన 239 మంది లబ్ధిదారులకు ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలు, మరో 135 మందికి జగనన్న ఇళ్ల పట్టాలను ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదల సొంతింటి కల నెరవేర్చిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. పథకాలన్నీ కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇటీవల జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన పలువురు వెయిట్‌లిఫ్టర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, ఏఎంసీ చైర్‌పర్సన్ చిక్కాల అరుణకుమారి, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, పార్టీ పట్టణ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠం, సర్పంచ్ రాయి పైడమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు మజ్జి త్రివేణి, నాయకులు గిరిబాబు, అక్కోజీ, డీఎంహెచ్‌ఓ భాస్కరరావు, కార్పొరేషన్ డైరెక్టర్లు జానా ప్రసాద్, శ్రీనివాసరావు, మద్దిల వాసు, తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో విశాలమైన రోడ్లు

• రూ.67 లక్షలతో రాజీవ్‌నగర్ కాలనీలో రోడ్డు
• ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



రూ.67 లక్షలతో నిర్మించిన రోడ్డు ఇదే



రాజీవ్‌నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



నూతన రోడ్డును ప్రారంభిస్తున్న మేయర్ విజయలక్ష్మి, స్థానిక కార్పొరేటర్లు

విజయనగరం: గత టీడీపీ పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి నోచుకోని జిల్లా కేంద్రమైన విజయనగరం నేడు అన్ని రంగాల్లో ప్రగతిపథంలో దూసుకుపోతోంది. 2019 ఎన్నికల అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనలో స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆలోచనలతో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఇప్పటికే ప్రధాన జంక్షన్‌లను అభివృద్ధి చేయగా.. ప్రధాన రహదారుల విస్తరణ పనులు ఒక్కొక్కటీ పూర్తి చేస్తున్నారు. తాగునీటి ఇబ్బందులకు తావులేకుండా ముందస్తు ప్రణాళికలతో వ్యవహరిస్తున్నారు. తాజాగా నగరంలోని ప్రధాన కాలనీల్లో విశాలవంతంగా రోడ్లును పునఃనిర్మిస్తున్నారు. 28వ డివిజన్‌లో పరిధిలో రాజీవ్‌నగర్ కాలనీ 30 ఏళ్ల కిందట ఏర్పడగా.. అప్పట్లో నిర్మించిన ప్రధానరోడ్డు పూర్తిగా పాడైంది. ఈ విషయాన్ని స్థానికులు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి దృష్టికి తీసుకెళ్లగా... అయన స్పందించి రూ. 67 లక్షలతో 400 మీటర్ల పొడవు, 40 అడుగుల వెడల్పుతో సీసీ రోడ్డు నిర్మించి, బుధవారం ప్రారంభించారు. అదేవిధంగా ఇదే డివిజన్ పరిధిలో గల పీఎస్ఆర్ కాలనీలో రూ. 23 లక్షలతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ.. నగరంలో గడిచిన 4 సంవత్సరాల 10 నెలలో కాలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సహకారంతో జిల్లా కేంద్రాన్ని ఎంతో అభివృద్ధి చేశామన్నారు. మరోసారి అవకాశం ఇస్తే సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ద్వారా తెలుసుకున్న సమస్యలను వెనువెంటనే పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టామని తెలిపారు. రాజీవ్‌నగర్ కాలనీ వాసులు గతంలో తాగునీటికి ఇబ్బంది పడేవారని, దీంతో దాసన్నపేట వాటర్ ట్యాంక్ నుంచి రాజీవ్‌నగర్‌కు పైప్‌లైన్లు వేసి తాగునీరు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ సంగంరెడ్డి బంగారునాయుడు, స్థానిక కార్పొరేటర్ జాకీర్ హుస్సేన్, పార్టీ నాయకులు గణపతి పాల్గొన్నారు.

నూతన సీసీ రోడ్లు ప్రారంభం..

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 38,43 డివిజన్‌ల పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ రహదారులను మేయర్ వెంపడాపు విజయలక్ష్మి బుధవారం ప్రారంభించారు. 38వ డివిజన్ బొబ్బాది పేటలో 9 లక్షల రూపాయలతో.. 43వ డివిజన్ ఉడా కాలనీలో 17.50 లక్షల రూపాయలతో వేసిన సీసీ రోడ్లను ఆమె ప్రారంభించి ప్రజా వినియోగంలోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నగరంలోని అన్ని మారుమూల ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు కల్పించిన ఘతన డిప్యూటీ స్పీకర్ కోలగట్లకు దక్కుతుందని చెప్పారు. రహదారులు, కాలువలు, కల్వర్టులు, వీధి దీపాలు వంటివి వేయడంతో పాటు పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. మరోసారి కోలగట్లను గెలిపిస్తే నగరం మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ డాక్టర్ వీఎస్ ప్రసాద్, స్థానిక కార్పొరేటర్లు తొగురోతు సంధ్యారాణి, దాసరి సత్యవతి, బొబ్బాది త్రినాథరావు, వంతరం సురేష్, తదితరులు పాల్గొన్నారు.

విప్లవాత్మక మార్పులతో ఉద్యోగ అవకాశాలు

• క్యూలిస్ కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ వంశీకృష్ణ

డెంకాద: సాంకేతికతలో వస్తున్న విప్లవాత్మక మార్పులతో కొత్త ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడం సులభతరమని హైదరాబాద్ మెట్రోరైల్‌కు చెందిన క్యూలిస్ కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ వంశీకృష్ణ అన్నారు. లెండి కళాశాలలో ఎలక్ట్రికల్ విభాగ విద్యార్థి సంఘ వార్షికోత్సవం (లక్ష్య-2024) కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ లాంటి బ్రాంచ్‌లలో విద్యనభ్యసించే వారికి ప్రత్యామ్నాయ శక్తి వనరులు, ఎలక్ట్రికల్ వెహికల్స్, చిప్ డిజైనింగ్‌లలో ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రిన్సిపాల్ వీవీ రామారెడ్డి మాట్లాడుతూ.. అన్ని విషయాల్లో ఎలక్ట్రికల్ విభాగం ముందుకెళ్తోందని, విద్యార్థులు మరింత ఉత్సాహంతో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం పవర్ పాయింట్ ప్రెజెంటేషన్స్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, పోస్టర్ ప్రజెంటేషన్, రోబోరైస్, రోబో వార్స్‌లలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిని నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో ఈఈఈ హెచ్ఓడీ కె.సుబ్బరామయ్య, బీవీఎస్ ఆచార్యులు, పి.జానకి, టి.పాపినాయుడు, కె.ప్రవీణ్, వైస్ ప్రిన్సిపాల్ హరిబాబు తమ్మినేని, కేవీ నరసింహం, ప్లేస్‌మెంట్ డీన్ జి.ప్రకాష్‌బాబు పాల్గొన్నారు.

శ్రీక్షేత్రమ్‌ను సందర్శించిన జియర్ స్వామి

విజయనగరం రూరల్: ప్రముఖ భారతీయ తత్త్వదర్శన కేంద్రం శ్రీక్షేత్రమ్‌లో కొలువై ఉన్న అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని త్రిదండి దేవనాథ జియర్‌స్వామి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా జియర్‌స్వామికి దేవాలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు స్వాగతం పలికారు. దేవాలయ అర్చకులు చామర్తి రమేష్ ఆచార్యులు, శ్రీనివాస రమేష్ ఆచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థగోష్టిలో స్వామిజీ భక్తులను ఆశీర్వదించారు.

అర్హులందరికీ పక్కా ఇళ్లు



హక్కు పత్రాలు అందజేస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: అర్హులందరికీ పక్కా ఇళ్లు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. బుధవారం సాయంత్రం నగరంలోని 8, 12 డివిజన్ పరిధిలోని లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్ మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేనివిధంగా లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేయడమే కాకుండా.. పూర్తి హక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ కూడా చేయించినట్లు చెప్పారు. సారిక, గుంకలాం, కొండకరకాం ప్రాంతాలలో పెద్ద ఎత్తున గృహ నిర్మాణాలు జరిగే విధంగా చొరవ చూపుతున్నామన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, కమిషనర్ ఎం.మల్లయ్యానాయుడు, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

మోసాలకు పాల్పడితే చర్యలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో రేషన్ డిపోలు, ఎండీయూ వాహనాలపై లీగల్ మెట్రాలజీ శాఖాధికారులు బుధవారం మెరుపుదాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ దామోదరనాయుడు ఆధ్వర్యంలో తంగుడుబిల్లి, రామతీర్థం, నెల్లిమర్ల, దన్నానపేట, మొయిద, జరజాపుపేట, తదితర గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. తూకాల్లో తేడాలు ఉన్నట్లు గుర్తించి ముగ్గురిపై కేసులు నమోదు చేశారు. తూనిక యంత్రాలకు తప్పనిసరిగా సీళ్లు వేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో టీఏ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

అభినందనలు

విజయనగరం అర్బన్: జిల్లా నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఇటీవల నిర్వహించిన వాలీబాల్ పోటీలలో విజేతలుగా నిలిచిన కస్పా మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు. నెహ్రూ యువకేంద్రం నెల్లిమర్ల బ్లాక్ జాతీయ సేవా కార్యకర్త కె. ప్రవల్లిక ఆధ్వర్యంలో పాఠశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.శంకరరావు, పీడీ పి.రమేష్, ఉపాధ్యాయులు పీవీ నిరుపమ, ఎస్. హారతి, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

'గ్రామాలను దత్తత తీసుకోవడం అభినందనీయం'

నెల్లిమర్ల రూరల్: గ్రామాల్లో ఫైలేరియా వ్యాధి నివారణే లక్ష్యంగా గ్రామాలను దత్తత తీసుకోవడం అభినందనీయమని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు అన్నారు. మండలంలోని ఒమ్మి గ్రామంలో సాయి ఫార్మాస్యూటికల్ పరిశ్రమ ఆధ్వర్యంలో 72 మంది ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు మార్బిడిటీ కిట్లను బుధవారం పంపిణీ చేశారు.